# ఆనందభవనం

## ౧

"జనార్దనం.... జనార్దనం.... ఇంకా రాలేదా ? రాలేదా ?" అని హీనస్వరంలో అంటున్నాడు మంచానికి అంటుకుపోయిన జగన్నాథం. గూట్లో బుడ్డిదీపం గుడ్డిగా వెలుగుతోంది. గోడమీద పురుగుల్ని వేటాడుతూ బల్లి పరిగిడుతోంది. తాటాకు విసనకర్రతో విసురుతున్న భార్య జగన్నాథం ధోరణి చూచి సంధి పుట్టిందేమోనని కలవరపడింది. కూతురు సావిత్రి డాక్టరు దగ్గరికి పరిగెత్తింది.

పెదవులు కదులుతున్నంతసేపూ జనార్దనంపేరు స్మరణ చేస్తూనే మృత్యుమందిరం వైపుకి తరలిపోతున్నాడు జగన్నాథం.

అయినా ఒక్కసారికూడా జనార్దనం రాలేదు. చిన్ననాటి స్నేహితుణ్ని ఒక్కసారి అయినా వచ్చి చూసిపోలేదు. అప్పలాచార్లుగారి వీధిబడిలో దస్తరాలు పెట్టుకుని రోజూ శ్రీ చుక్కా తమరిద్దరే దక్కించుకుంటూ, ఆటల్లో పాటల్లో ఒకటిగా పెనవేసుకొని పెరిగిన ప్రాణస్నేహితులు వాళ్లిద్దరూ. ఎడబాయని, విడదీయలేని స్నేహానికి వాళ్లిద్దరినీ తార్కాణంగా ఊళ్లో అంతా చెప్పుకునేవాళ్ళు. అటువంటివాడు అవసాన ఘడియల్లోవున్న స్నేహితుడు ఎన్నిసార్లు కబురుపంపినా ఏదో సాకుచెప్పి ముఖం చాటువేస్తున్నాడు. కాని జగన్నాథం మటుకు తన స్నేహితుడు తప్పక వస్తాడనే ఆశని అఖరిక్షణందాకా విడవలేకపోయాడు.

"అత నెందుకొస్తాడండీ ? మీ వెర్రిగాని—" అని భార్య అన్నప్పుడల్లా జగన్నాథం కస్సుమని కరవచ్చాడు.

ఆయాసం పుట్టింది. కొనవూపిరితోవున్న జగన్నాధాన్ని ఈతాకు చాపమీద పడుకోబెట్టారు. "మీరేం దిగులుపడకండి. అన్నిటికీ జనార్దనం వున్నాడు!" అనే హామీయిచ్చి మైకంతో కళ్ళు మూసుకున్నాడు.

అంతా అయిపోయాక జనార్దనంవచ్చి క్షణంసేపు బెల్లం కొట్టిన రాయిలాగా నిలబడి, నాటకంలోని పాత్రధారిలాగా రాని కన్నీళ్ళని తుడుచుకుంటూ బైటికి వెళ్ళిపోయాడు.

మర్నాడు సావిత్రి జనార్దనం మేడలోకివెళ్ళి "మామయ్యా! నువ్వే మాకిక దిక్కు" అని గొల్లుమంది.

"విచారపడకమ్మా! అందరికీ ఆ భగవంతుడే దిక్కు!" అంటూ జనార్దనం దులుపుకుని వెళ్ళిపోయాడు.

తన తండ్రి ఎంత అమాయికుడో ఆ క్షణంలో సావిత్రికి అర్థమయింది.

అతి కష్టంమీద కర్మకాండ అంతా జరిగింది. జనార్దనం ఇంటి కాకికూడా వీళ్ళ గుడిసెమీద వాలలేదు. అయినా జగన్నాధం భార్య మనసు వుండబట్టలేక "ఒక్కసారి మామయ్యని నేను రమ్మన్నానని పిలుచుకురా! ఒక్కమాట వినిపొమ్మని చెప్పు" అని సావిత్రిని బతిమాలి పంపించింది.

ఆరోజు ఏ కళన వున్నాడో జనార్దనం వచ్చాడు. "ఈసారి మంచం ఎక్కిన దగ్గిరనుంచీ నీ కోసం ఒక్కవరసన కలవరించారు!" అని కళ్ళు తుడుచుకుంది సావిత్రి తల్లి కాంతమ్మ.

"తీరుబాటు లేకపోయింది" అని ఇంటికప్పుకేసి చూస్తూ కూచున్నాడు జనార్దనం.

"నీ దగ్గర పిల్ల పెళ్ళికోసం ఏదోదాచానని చెప్పారు...." అని కాంతమ్మ అంటుండగానే నిప్పులు తొక్కిన కోతిలాగా

"అంతా అబద్ధం. జగన్నాథానికి చివరిరోజుల్లో మతి సరిగ్గాలేదు" అని కేకలుపెట్టి ఎంతపిలిచినా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు జనార్దనం.

తల్లీ కూతురూ తలమీద పిడుగుపడినట్లు అక్కడే కూలబడి పోయారు.

౨

"అబ్బాయి వైకుంఠం! కలెక్టరుగారి మనుమరాలిని వచ్చి చూడమని పదేపదే కబుర్లు పెడుతున్నారు. పెద్దవాళ్ళతో వ్యవహారం. నువ్వూ మీ అమ్మా ఇవాళ వెళ్లి చూసిరండి. శాస్త్రుల్లగారు ఇవాళ చాలా మంచిరోజని చెప్పారు...." అని జనార్దనం అటూ ఇటూ పచార్లుచేస్తూ అన్నాడు. బట్టతల అదృష్టానికి సూచన అయితే అంతకంటే అదృష్టవంతుడు లేడని చెప్పాలి! అరంగుళం మందానవున్న కళ్లద్దాలవల్ల ఆయన ముఖంలో ఏ భావమూ కనిపించకుండా నిర్వికారపరబ్రహ్మం లాగుంటుంది.

వైకుంఠం మేడమెట్లు ఎక్కుతున్నవాడల్లా ఠక్కున ఆగి గిరుక్కున వెనక్కి తిరిగి "వెళ్లను. నాకు ఇష్టంలేదు" అని ముక్తసరిగా బదులు చెప్పాడు.

"వచ్చిన సంబంధాలన్నీ చెడగొట్టుకుంటే ఎల్లాగోయ్?" అని కసిరాడు జనార్దనం.

"నా పెళ్లి విషయం నాకు వదిలెయ్యండి. అనవసరంగా బాధపడకండి" అన్నాడు వైకుంఠం.

"ఆఁ. ఏమన్నావ్? నోరుముయ్. నీ వాలకం నేను కనిపెట్టలేదనుకున్నావా? ఆ ముష్టిసంబంధానికి నాఘటం వుండగా ఒప్పుకోను" అని తోకతొక్కిన తాచులాగా బుసకొట్టాడు.

"నోటికి ఎంతమాటవస్తే అంతేనా?" అని భార్య భద్రమ్మ ఇద్దరిమధ్యా వచ్చి నిలబడింది.

"నువ్వా ఉబలాట పడుతున్నావని నాకు తెలుసు. కాని ఆ ముష్టి సంబంధం ఒక్కనాటికీ నే నొప్పుకునేది లేదు" అని పళ్ళు పటపట కొరికాడు తండ్రి.

తండ్రితో వాగ్యుద్ధానికి దిగటం ఇష్టంలేక మెదలకుండా అక్కడినించి వెళ్ళిపోయాడు వైకుంఠం.

"మధ్యలో వచ్చిన భాగ్యాన్నిబట్టి అనాదినుంచీ వస్తున్న అనుబంధాలు తెగిపోవలిసిందేనా?" అని వ్యధపడుతూ అడిగింది భార్య భద్రమ్మ.

"నిన్నెవరూ తీర్పుకి పిలవలేదు. పో అవతలికి" అని అరిచాడు జనార్దనం.

"ముష్టి సంబంధం" అన్నమాటలు తుపాకీ గుండులా పేలి గుండెల్ని తూట్లు పడేసినయ్.

కారులో ఎక్కి తొందరగా వెళ్ళిపోతున్న భర్తకేసి చూస్తూ భద్రమ్మ అక్కడే నిలబడిపోయింది.

తమ కుటుంబం పూటకి తిననాలేని దశలో గ్రామంనించి పట్నం రావటం....చుట్టరికం లేకపోయినా చిన్ననాటి చెలిమినిబట్టి జగన్నాధం తమని కడపులో పెట్టుకుని కంటికిరెప్పగా కాపాడటం... వాళ్ళ ఆనందభవనంలో దొడ్డివైపు భాగంలో తమకాపురం....తన భర్త గుమాస్తాగా చేరటం....జగన్నాధం పెట్టుబడితో వడ్లమర కొనటం....వ్యాపారంలో భర్త చరచరా పైకి పాకి లక్షాధికారి కావటం....నల్లటివన్నీ నీళ్ళూ తెల్లటివన్నీ పాలు అని నమ్మే జగన్నాధం కుటుంబం నానాటికి దిగజారి పోవటం....గతమంతా బండిచక్రపు ఆకుల్లాగా కళ్ళముందు గిర్రున తిరిగింది.

దిక్కులేకుండా వచ్చి ఆనందభవనంలో తలదాచుకున్న జగన్నాధం సంసారం చితికి చివికి ఒకప్పుడు తమ చేత్తో కట్టుకున్న ఆనందభవనం ఆవరణలో మారుమూల గొడ్లపాకలో అష్టకష్టాలు పడుతోంది....

సంసారాల భాగ్యాలు కెరటాల లాగా, కలసివచ్చినన్నాళ్ళూ పైకిసాగి అటుపైన విరిగి కూలిపోతయ్. ఏతం కొమ్ములాగా ఒకసారి ఆకాశంలోకి లేచిన సంసారమే కొంతకాలం తరవాత అట్టడుగుకి అణగారి పోతుంది.

భద్రమ్మ పూర్వవాసనలని మరిచిపోలేదు. అభిమానం వున్నా చండశాసనుడైన భర్తకి ఎదురుమాట చెప్పలేక మనస్సులోనే కుములుతూ వుంటుంది.

జనార్దనం మాత్రం గతమంతా, మాసినచొక్కాని విడిచి గిరాటు వేసినట్లు దూరంగా నెట్టేశాడు. ఇప్పుడు ఆ వూళ్ళో ఘరానా మనిషి! కార్లలో షికారు తిరుగుతూ బాంకుల్లో లాభాలు పెంచుతూ గుప్‌గుప్ మని సిగరెట్ పొగవాదిలే హేమా హేమీ! అందుకే కలెక్టరుగారి మనమరాలిని కోడలుగా తెచ్చుకుని వియ్యంలో సమవుజ్జీని సంపాయించాలని అంతఆరాటం! కొడుకు తనమాట కాదన్నందుకు అంత ఆర్భాటం.

## 3

"ముసలాడు పురుగులుపడి చస్తాడు! నా నోట మన్ను కొట్టి బాగుపడతాడా!" అని తిట్టుకుంటూ ఒక ముసలమ్మ గేటు దగ్గిర ఎదు రయింది.

ఏమిటని అడిగాడు లోపలికి వస్తున్న వైకుంఠం, పదేళ్ళ కింద అప్పుతీసుకుంది. వసూళ్ళు ఇచ్చింది. అప్పు తీరిపోయిం

దనే ఆశతో వచ్చి లెక్క చూడమని అడిగితే ఇదుగో అదుగో అని తిప్పి చివరికి నువ్వు నాకేమీ వసూలు ఇవ్వలేదు. కోర్టులో దావా వేస్తానని బెదిరించాడట జనార్దనం.

ఇంకో నాలుగడుగులు ముందుకి వేసేసరికి ఒక వృద్ధ బ్రాహ్మణుడు నెత్తీ నోరూ కొట్టుకుంటూ "నాశనమై పోతావు!" అని శపిస్తున్నాడు. తీర్థయాత్రలకి వెళ్తూ భార్య నగలూ తనవెండి చెంబూ ఇనప్పెట్టెలో దాచి పెట్టమని తండ్రికి ఇచ్చాడట. తిరిగి వచ్చాక అడిగితే "నేనేమి ఎరగను" అని బుకాయించి నౌకరుచేత గెంటించాడట.

వైకుంఠం రక్తం తుకతుకా వుడికిపోయింది. ఆస్తిమీద అతనికున్న అసహ్యం మరీఎక్కువై పోయింది. లోకానికి కావలిసింది భాగ్యమే కాని అది ఎల్లాపోగయిందో అక్కర్లేదు. అసలు ఆస్తి అనేది మోసంతో కాని పోగుపడదని వైకుంఠం విశ్వాసం.

ఆనందభవనంలో భోగభాగ్యాలతో తులతూగుతున్నా వైకుంఠం అంపశయ్యమీద వున్నంతబాధ పడుతున్నాడు. ఈఆస్తి పెద్ద పంజరంలాగా తనని బంధిస్తున్నట్లు తన్నుకుంటున్నాడు.

"ఈ పాట్లన్నీ నీకోసమే కాదుటోయ్?" అన్నాడు తండ్రి. ఈ అక్రమాలూ, అన్యాయాలూ, ఈ కపటనాటకాలూ, మోసాలూ తన కోసమే! ఈ వంచితుల శాపనార్థాలన్నీ తనకి సంక్రమించే ఆస్తిని వెన్నంటివచ్చే ఆశీర్వాదాలు....అన్నిటికీ తను వారసుడే!

"అత్తయ్యా! ఒక శేరు బియ్యం బదులిస్తావా?" అని చిన్న బుచ్చుకున్నముఖంతో అడిగి బుట్టలో పోసుకుని తనకి కనబడకుండా వెళ్లిపోతోంది సావిత్రి.

మామయ్య నష్టేట్లో వదిలి వెళ్లిపోయాడు. సావిత్రికి పెళ్లి కాలేదు. చదువు స్కూలుఫైనలుతో కట్టిపెట్టవలసి వచ్చింది. ఈ

విపత్తులో వాళ్లకి దిక్కు ఎవరు? వాళ్ల ఆలనా పాలనా కనుక్కునే వాళ్లెవరు? మరణశయ్యమీద వున్న మామయ్య ఎన్ని కబుర్లు పంపినా తండ్రి వెళ్లలేదని విన్నాడు....సావిత్రి పెళ్లికని జగన్నాధం తన తండ్రి దగ్గిర కొంతపైకం దాచుకున్నట్లు చెప్పాడని తెలిసింది.... తండ్రి తన దగ్గిర కానీకూడా లేదన్నాడట.... అంతు కనుక్కోవాలి. చటుక్కున జ్ఞాపకం వచ్చింది. పెట్టె అంతా దుస్తులకోసం గాలించాడు....ఆరాత్రే....

అర్ధరాత్రి.... గదిలో గడియారం టిక్‌టక్.... నిశ్శబ్దం.... దక్షిణపు కిటికీలోంచి చలిగాలి.... జనార్దనం నిద్రపట్టక పక్కమీద అటూ ఇటూ కొట్టుకుంటూ శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం.... అని దండకం వల్లిస్తున్నాడు....తల దగ్గిర తెల్లటి ముసుగులతో నఖశిఖ పర్యంతమూ కప్పుకున్న భయంకరరూపం.... "లే! నేను జగన్నాధాన్ని.... నిన్ను వదిలిపెట్టను. లే!" అని వణుకుతున్న బొంగురుకంఠం వినిపించేసరికి పక్కమీద ముచ్చెమటలు పోసి మలేరియా రోగిలాగా గజగజలాడిపోయాడు జనార్దనం. శ్రీ ఆంజనేయం.... ప్రభాదివ్యకాయం .... ప్రకీర్తిప్రదాయం అని గద్గద స్వరంతో గట్టిగా చదవటం మొదలుపెట్టాడు. "లాభంలేదు. నిన్ను అంజనేయుడుకూడా రక్షించలేడు. నిన్ను వదలను. లే! తాళం చెవులు తియ్యి. నేను దాచమని ఇచ్చిన పైకం తిరిగి ఇస్తావా లేదా? ఇచ్చేదాకా నీ కళ్లమీదికి నిద్రరాదు. నువ్వు తిందామనుకున్న అన్నమంతా పురుగులై పోతుంది. నిన్ను నరకబాధలు పెడతాను." అని ఆ కంఠం బెదిరించేసరికి చేతులు జోడించి "వద్దు, వద్దు. నువ్వుదాచిన మూడువేలూ ఇప్పుడే ఇచ్చేస్తాను." అని తడువుకొని తాళంచేతులు తీసి ఇనప్పెట్టె తెరిచి నోట్లదొంతర తెచ్చి అందించాడు. ఆ దయ్యం కళ్లు జిగేలుమనే కాంతితో

జనార్దనం కళ్లు మిరుమిట్లుకొలుపుతూ "ఈ రహస్యం ఎవరికైనా చెప్పావా నీ పని పట్టిస్తా!" అని హుంకరిస్తూ ఆ నోట్ల దొంతరని అందుకొని అద్భుతంగా కిటికీలోంచి అంతర్ధానమైపోయింది.

"నాకు భయంగావుందే" అని లైటు వెలిగించి తెల్లవార్లూ జనార్దనం జాగారంచేశాడు.

"అబ్బాయిని పిలవనా? డాక్టర్ని పిలిపించ మంటారా?" అని భద్రమ్మ ఆదుర్దాగా అడిగింది.

"ఎవరూ అక్కర్లేదు" అంటూ తెల్లవార్లూ గ్లాసు తరువాత గ్లాసు మంచినీళ్లు తాగుతూ ఇల్లంతా పచార్లు చేశాడు జనార్దనం.

వైకుంఠం గది తలుపు తెరవనేలేదు. Hamlet నాటకములో దయ్యంవేషం కాలేజీలో వేసిన అనుభవం వృథాపోలేదు.

౪

"అత్తయ్యా! ఇదిగో మీ సావిత్రికి పెళ్లికట్నం" అంటూ పొద్దున్నే తయారైనాడు వైకుంఠం.

అర్థంకాక తికమకపడింది కాంతమ్మ. ఆ నోట్ల దొంతర చూసేసరికి కళ్లు తిరిగిపోయినై.

"ఎక్కడిది?"

"మీదే. నాన్నదగ్గిర మామయ్య దాచిన పైకం."

"ఏమీ లేదన్నాడే మీ నాన్న! అయినా ఎల్లా తెచ్చావు నాయనా?"

అది నువ్వు అడగనూకూడదు. నేను చెప్పనూ కూడదు. అని గంభీరంగా అనేసి బూట్లశబ్దంవిని ఆశ్చర్యపోయి "ఏమిటీ వేషం?" అని నర్సువేషంలో బైటికి వచ్చిన సావిత్రిని చూసి విస్మయంతో అడిగాడు.

"అమ్మాయి ఆసుపత్రిలో ఉద్యోగం సంపాయించింది. మీ మామయ్య స్నేహితుడు డాక్టరు శంకర్రావుగారు ఇప్పించారు..." అంది కాంతమ్మ.

"పెళ్లి చేసిచూడు సినిమాలో నర్సులాగే వున్నావు! బాగుంది వేషం" అని నవ్వాడు వైకుంఠం.

"నాయనా పెళ్లిఅంటే గుర్తొచ్చింది. ఆడపిల్లకి ఉద్యోగాలేమిటి? ఎక్కడైనా మంచి సంబంధం చూసిపెడుదూ, నీకు పుణ్యం వుంటుంది...." అని కాంతమ్మ వెర్రిబాగులతనం వెల్లడించుకుంది.

"ఆ శ్రమ నాకెందుకూ? మీ అమ్మాయినే వెతుక్కో మనవమ్మా అత్తయ్యా! అసలీపాటికే వెతుక్కుందేమో ఎప్పుడైనా అడిగావా?" అంటూ లేచాడు వైకుంఠం.

గులాబిమొగ్గలవంటి సిగ్గు దొంతరలతో వైకుంఠంవైపు ఓరచూపు చూస్తూ దొంగలాగా జారిపోయింది సావిత్రి.

గడపదాటేసకి జనార్దనం గుమస్తా గురునాధం "అయ్యగారు ఇవాళ ఈ పాక ఖాళీచెయ్యాలని మీతో చెప్పమన్నారు...." అంటూ యమదూతలాగా ఎదురైనాడు.

"చెయ్యరని చెప్పు. నేనుచెప్పానని చెప్పు. వెళ్లు!" అంటూ వైకుంఠం కేక పెట్టాడు.

"మీనాన్నకి ఎందుకింత శత్రుత్వం? ఈ పాకలోవున్నా మాచేత్తోకట్టుకున్న ఆనందభవనంకేసి చూస్తూ ప్రాణం వదలాలని నా కోరిక. మీ నాన్నకి ఆ మాత్రం కూడా దయకలిగేట్లులేదు. నేనింకేమీ కోరను. నా కింకేఆశాలేదు. నా జీవితంలో సుఖదుఃఖాలన్నిటినీ చూసిన ఈ ఆనందభవనం కళ్ళకి కనబడకపోతే బతకలేను. ఆ మేడచూసి....ఈ యింట్లో నవవధువుగా అడుగుపెట్టి

ఆ మూడో అంతస్తు గదిలో మధుర స్వప్నాలుగా గడిపినరోజులు గుర్తుకి తెచ్చుకుంటూ....అల్లా చూస్తూ చూస్తూ ప్రాణం హరీ అనాలి....పై అంతస్తుమీద కృష్ణవిగ్రహం నా కళ్లలో నిలిచి పోవాలి...." అంటూ కాంతమ్మ పసిపిల్లలాగా గొల్లుమన్నది.

"మీ ఇంట్లోంచి మిమ్మల్ని ఎవరు వెళ్ళగొట్టగలరమ్మా ? నీ కెందుకూ భయం ?" అని ఓదారుస్తూ బైటికి వచ్చాడు.

౫

"నా మాటకి తిరుగులేదు. లేదంటే లేదు" అని జనార్దనం సింహగర్జన చేశాడు. "ముష్టి సంబంధం !"

"ఒక్కగాను ఒక్క కొడుకు. ఎన్నో వ్రతాలూ నోములూ చేసిన ఫలంగా కలిగాడు. వాణ్ని దూరం చేసుకుంటారా ?" అని దీనంగా బతిమాలింది భద్రమ్మ.

"ఇక వాడి మొహం చూడను" అని గట్టిగా అరిచాడు. "ఈ ఘటం ఇల్లా వెళ్ళిపోవలసిందే."

"వాడు ఏం ఘోరమైన అపరాధం చేశాడని మీకీ కక్ష ?"

"అదంతా నీ కనవసరం !"

"అయితే ఇవాళనించీ నేనూ వాడిదగ్గిరే వుంటాను. మీ రొక్కరే ఈ లంకంత ఇంట్లో బిక్కుబిక్కుమంటూ వుండండి.... కొడుకూ కోడలూ చిలకా గోరంకల్లావుంటే సంతోషించక ఎందు కొచ్చిన పట్టుదల లండీ ?" అని ఎన్నాళ్లనుంచో అణగారిన ధైర్యాన్ని చిక్కబట్టుకుని తెగించి అనేసింది.

"ఫో ! నువ్వుకూడా ఆ ముఠాలో చేరు. మీరంతా నా శత్రువులు. పొండి" అని రంకెలు వేశాడు జనార్దనం.

"వెళ్తున్నావా? నీకూ నీ కొడుక్కీ ఇక్కడ చిల్లిగవ్వ మిగల్చను. ఇదంతా నా స్వార్జితం. నా యిష్టం వచ్చినట్లు ఆస్తి విరజిమ్మి వేస్తాను. వెళ్లు!" అని ఉద్రేకంతో ఉరుములాగా అరిచాడు.

భద్రమ్మ బెదరలేదు. "మరీ మంచిది!" అనుకుంటూ వెళ్ళిపోయింది. కొడుకూ కోడలూ సుఖంగా వుండటంకంటె మహాభాగ్యం ఏముంది? వాళ్లు రెక్కలకష్టంతో సుఖంగా జీవిస్తున్నారు. తన కే లోపమూ రానివ్వరు. వాళ్ళ రెక్కలు చల్లగా వున్నంతకాలమూ తన కే కొరతా వుండదు. అనుబంధాలని తెంపేసి ఆత్మీయతని చంపేసిన ఈఆస్తి క్రూరరాక్షసి అనిపించింది.

"మీ ఇష్టం! నేను వెళ్తున్నా"? అని తిరిగి చూడకుండా సాగిపోయింది భద్రమ్మ.

మర్నాడే ఆనందభవనానికి తాళం పడింది. అరవైయేళ్ళ జనార్దనంలో రెండో వసంతం అంకురించింది. ఆస్తినంతా ఒక ప్రియురాలి పేరరాసి కొడుకుమీద కసితీర్చుకున్నాడు.

ఆ వార్త విని "బ్రతుకుజీవుడా!" అని నిట్టూర్పు విడిచాడు వైకుంఠం.

అప్పులకి దూరమైన జనార్దనం ఏమైనాడో ఆచూకీ తెలియదు. ఆనందభవనం తాళం మాత్రం ఇవాళదాకా ఎవరూ తెరిచిన వాళ్లు లేరు.